## మైనార్టీ గురుకుల పాఠశాలను పరిశీలించిన కలెక్టర్



మైనార్టీ గురుకుల పాఠశాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్

**కంది, జూలై 8, (ప్రభాతవార్త):** మండల కేంద్రంలోని మైనారిటీ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలను మంగళవారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పరిశీలించారు. పాఠశాల పరిసరాలను, వసతి గృహాలోని వంట గదిని, కూరగాయలు, బియ్యం, పప్పు తదితర సరుకులను పరిశీలించారు. విద్యార్థులకు వడ్డించేందుకు తయారు చేసిన ఆహార నాణ్యతను పరిశీలించి భోజన విధానాన్ని పరిశీలించారు. ప్రతి విద్యార్థి శ్రద్ధతో విద్యను అందుకుని ఉన్నతులుగా ఎదగాలని సూచించారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట



వార్త

## గ్రంథాలయ అభివృద్ధికి కృషి : ఎంపి, ఎమ్మెల్యే

**నారాయణఖేడ్ జూలై 8 ప్రభాతవార్త :** నారాయణఖేడ్ గ్రంథాలయం అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. తహసీల్దార్ గ్రౌండ్‌లో గ్రంథాలయం మొదటి అంతస్తు, ప్రహరీగోడ నిర్మాణానికి వారు శంకుస్థాపన చేశారు. అనంతరం సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో నారాయణఖేడ్ గ్రంథాలయం ప్రథమ స్థానంలో ఉందని, నిరుద్యోగ యువత చదువుకోవడానికి ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. అలాగే నారాయణఖేడ్ ప్రభుత్వ కళాశాలలో రీడింగ్ రూములు ప్రారంభించినట్లు చెప్పారు. గ్రామాల్లోనూ అవసరం ఉన్న చోట జిల్లా గ్రంథాలయ సంస్థకు దరఖాస్తు చేయాలని సూచించారు. నూతన పుస్తకాల సేకరణకు ఎంపీ నిధుల నుండి రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ శంకర్‌షెట్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాహిర్ అలీ, కౌన్సిలర్ వివేకానంద మహేందర్,రాజేష్, హన్మంత్,దిశ కమిటీ సభ్యులు ప్రకాష్ రాథోడ్, వి వి పాటిల్ న్యావది, రమేష్ చౌహాన్, వినోద్ పటేల్, ఇతర నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు హాజరయ్యారు.



సిపి అనురాధను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఎస్ఐలు

## ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి

### సిపి డా. అనురాధ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

శిక్షణ పూర్తిచేసుకొని బాధ్యతలు స్వీకరించిన నూతన ఎస్ఐలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండడంతోపాటు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని సిపి డాక్టర్ అనురాధ సూచించారు. జిల్లాలో శిక్షణ పూర్తి చేసుకొని వివిధ పోలీసు స్టేషన్లలో నూతనంగా ఎస్ఐలుగా బాధ్యతలు చేపట్టిన వారు మంగళవారం సిపి కార్యాలయంలో సిపి డాక్టర్ అనురాధను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాలు అందజేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో సిపి డాక్టర్ అనురాధ మాట్లాడారు.ప్రొయాక్టివ్ పోలీసింగ్ విధులు నిర్వహించాలని..శాంతిభద్రతలకు పెద్దపీట వేయాలన్నారు. మొదటి పోస్టింగ్‌లో నిర్వహించిన విధులు జీవితాంతం గుర్తుంటాయన్నారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ అంకిత భావం నిజాయితీగా విధులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలని ఏదైనా సంఘటన జరిగితే వెంటనే సంఘటన స్థలానికి వెళ్లాలన్నారు. డయల్ 100 కాల్ రాగానే వెంటనే స్పందించాలన్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. నూతన చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి దరఖాస్తుపై విచారణ చేపట్టి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. సిసి కెమెరాలపై అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐలు సౌజన్య, సుమత, మానస, నవీన్, అరుణ్‌కుమార్, ప్రశాంత్, మహ్మద్ షైఫ్ అలీ, ఎస్‌బి సిఐ కిరణ్, శ్రీధర్‌గౌడ్, మల్లేశంగౌడ్ పాల్గొన్నారు.

## సిగాచి పరిశ్రమను సందర్శించిన ఎన్డీఎంఏ బృందం



సిగాచి పరిశ్రమను సందర్శిస్తున్న ఎన్డీఎంఏ బృందం

**పటాన్‌చెరు, జూలై 8, ప్రభాతవార్త:** ఇటీవల భారీ ప్రమాదం జరిగిన పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచి ఫార్మా కంపెనీని మంగళవారం జాతీయ విపత్తు నివారణ సంస్థ బృందం సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్డిఎంఏ కేంద్ర బృందం కమిటీ సభ్యులు, సిగాచి పరిశ్రమలో ప్రమాదం జరగడానికి గల కారణాలపై నిశితంగా అధ్యయనం చేశారు. పరిశ్రమలో జరిగిన భారీ ప్రమాదానికి గల కారణాలు అధ్యయనం చేయడంతోపాటు ఇలాంటి సంఘటనలు పరిశ్రమలో పునరావృతం కాకుండా చేపట్టాల్సిన చర్యలపై కేంద్ర ప్రభుత్వం నిర్వహణ సంస్థ కమిటీ సభ్యులు సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంఘటన జరిగిన తీరును బృందం సభ్యులకు వివరించారు. ప్రమాదం జరిగిన తర్వాత చేపట్టిన సహాయక చర్యలను కమిటీ సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, పరిశ్రమల శాఖ, అగ్ని మాపక శాఖ,కార్మిక శాఖ, పోలీసు, రెవెన్యూశాఖల అధికారులు పాల్గొన్నారు.

## సమ్మెను జయప్రదం చేయాలి : సిఐటియు కార్యదర్శి రమేష్

**నాగల్‌గిద్ద, జూలై 8, ప్రభాతవార్త:** ఈ నెల 9న దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులు, కర్షకులు పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని నారాయణఖేడ్ డివిజన్ కార్యదర్శి రమేష్, నాయకులు గణపతిలు వినతి చేశారు. మంగళవారం నాగల్‌గిద్దలో సార్వత్రిక సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు.

## చెరువులో కంచె తొలగించండి

### పరిశ్రమ యాజమాన్యానికి అధికారుల ఆదేశాలు

**జిన్నారం, జూలై 8, ప్రభాతవార్త:** మండలంలోని గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అయ్యమ్మ చెరువులో మధ్య నుంచి ఫెన్సింగ్ వేయడం మత్స్యకారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. దీనిపై స్పందించిన రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు మంగళవారం చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా నీటిపారుదల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జయ ప్రకాశ్ నారాయణ, సర్వేయర్ సంగీత పరిశీలించారు. చెరువు మధ్యలో కంచె ఏర్పాటు చేయడాన్ని వారు తీవ్రంగా తప్పుబట్టారు. తక్షణమే ఫెన్సింగ్ తొలగించాలని పరిశ్రమ యాజమాన్యాన్ని ఆదేశించారు. వారం రోజుల్లోగా ఫెన్సింగ్ తొలగించి మత్స్యకారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని యాజమాన్యం హామీ ఇచ్చింది. అధికారులు మాట్లాడుతూ. చెరువు మధ్యలో ఫెన్సింగ్ ఉండటంతో మత్స్యకారులు చేపలు పట్టడం అసాధ్యమవుతోందన్నారు. పైగా నీళ్ల ప్రవాహానికి కూడా అంతరాయం కలుగుతున్నదని స్పష్టం చేశారు. వారం రోజుల్లోగా ఫెన్సింగ్ తొలగించకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



చెరువును పరిశీలిస్తున్న అధికారులు

# మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట (ప్రభాతవార్త) ప్రతినిధి(చిన్నకోడూరు):** పర్యావరణ పరిరక్షణకు దోహదపడే మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. చిన్నకోడూరు మండలం చంద్లాపూర్‌లోని పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం, పశుసంవర్ధక పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం వనహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వనమహోత్సవంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు.

**ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గుపోసిన కలెక్టర్**

చిన్నకోడూరు మండలం గంగాపూర్ గ్రామంలో ఇందిరమ్మ గృహాల నిర్మాణంలో భాగంగా జిల్లా కలెక్టర్ హైమావతి ముగ్గుపోశారు. అదే గ్రామానికి చెందిన ఇద్దరు ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవడానికి డబ్బులు లేవని చెప్పగానే అప్పుగా డబ్బులు ఇప్పిస్తానని ప్రభుత్వం నుండి డబ్బులు విడుదల కాగానే మళ్లీ ఒకటి విఓ సంఘానికి అందజేయాలన్నారు. ఇళ్ల నిర్మించుకోవడానికి డబ్బులు లేని పేదలకు బ్యాంక్ ద్వారా అందించాలని డీఆర్‌డీఏపిడి జయదేవ్ ఆర్యను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక కొరత లేకుండా టోకెన్లు అందించాలని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు.

**పంప్ హౌస్‌ను పరిశీలించిన కలెక్టర్**

చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ గ్రామంలో గల రంగనాయకసాగర్ పంప్ హౌస్‌ను కలెక్టర్ హైమావతి పరిశీలించారు. అండర్ టన్నెల్ ద్వారా ప్రయాణించి పంప్‌హౌస్‌ని చేరుకోగా రంగనాయక సాగర్ డిఈ చంద్రశేఖర్ పంపు హౌస్‌లోని అన్ని విభాగాలను వివరించి కాళేశ్వరంప్రాజెక్టులో భాగంగా నిర్మించిన రంగనాయకసాగర్ రిజర్వాయర్, పంప్ హౌస్ వివరాలను వివరించారు. రిజర్వాయర్‌లోకి వాటర్ పంపింగ్ స్థలాన్ని పరిశీలించారు. ఆమె వెంట ఆయా కార్యక్రమాల్లో డిఆర్‌డిఏపిడి జయదేవ్ ఆర్యా, తహసీల్దార్ సలీం మియా, ఎంపిడీవో, పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ తదితరులు ఉన్నారు.



రంగనాయకసాగర్ పంప్ హౌస్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి



జగ్గయ్యగారి శేఖర్‌గుప్తను సన్మానిస్తున్న సూర ఆంజనేయులు

## ఆర్యవైశ్యుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

### -నాచారం ఆలయ డైరెక్టర్ జగ్గయ్యగారి శేఖర్‌గుప్త

**గజ్వేల్, జూలై 8 (ప్రభాతవార్త):** ఆర్యవైశ్యుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని నాచారం పాలకమండలి సభ్యులు జగ్గయ్యగారి శేఖర్ గుప్త పేర్కొన్నారు. మంగళవారం ప్రజ్ఞాపూర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సూర ఆంజనేయులు, ఆర్యవైశ్య జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఎన్‌సి. సంతోష్ ఆధ్వర్యంలో నాచారం పాలక మండలి సభ్యులుగా నూతనంగా ఎన్నికైన జగ్గయ్యగారి శేఖర్‌గుప్తను సన్మానించారు. ఈ సందర్భంగా శేఖర్ గుప్త మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి సహకారంతో నాచారం పాలకమండలి సభ్యునిగా ఎన్నికైనట్లు పేర్కొన్నారు. ఆర్యవైశ్యులకు కాంగ్రెస్ ప్రభుత్వంలో సముచిత స్థానం ఉంటుందని, గత ప్రభుత్వం ఆర్యవైశ్య నాయకులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సిద్దిపేట జిల్లా యువజన విభాగం కార్యదర్శి గోపిశెట్టి అశోక్‌కుమార్, వైశ్య సంఘం సీనియర్ నాయకులు పొద్దుటూరి చంద్రశేఖర్, కాసం భాస్కర్, గంగిశెట్టి భాస్కర్, కూర నాగరాజు, చంద సందీప్, పొద్దుటూరి ఆంజనేయులు, పొద్దుటూరి శ్రీనివాస్, పొద్దుటూరి నరేందర్, పొద్దుటూరి రాజనర్సయ్య, వేణు, మద్ది వేణు, సూర శ్రీనివాస్, పి.శ్రీనివాస్, పి.రవీందర్, రమేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## తండా వాసులకు తాగునీటి బోరు

**పుల్‌కల్, జూలై 8, ప్రభాతవార్త:** మండలంలోని మిన్‌పూర్ గిరిజన తండాలో తాగునీటి గోస తీర్చేందుకు తండా వాసుల వినతి మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి దామోదర్ రాజనర్సింహా మంజూరు చేసిన నిధులతో ఏర్పాటుచేసిన బోరుకు మంగళవారం మోటారును బిగించి మంచి నీటిని సరఫరా చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు మల్లన్నగారి దుర్గారెడ్డి బోరు మోటారు స్విచ్ ఆన్ చేసి నీటి సరఫరాను ప్రారంభించారు. బోరు ఏర్పాటుకు నిధులు మంజూరు చేసిన మంత్రి దామోదర్ రాజనర్సింహాకు మండల కాంగ్రెస్ అధ్యక్షులు దుర్గారెడ్డి, కాంగ్రెస్ నాయకులు రమావత్, శంకర్ నాయక్ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

## అచ్చంపేటలో యువతి అదృశ్యం

**నర్సాపూర్, జూలై 8, ప్రభాతవార్త:** యువతి అదృశ్యమైన సంఘటన నర్సాపూర్ మండలం అచ్చంపేట గ్రామంలో మంగళవారం జరిగింది. కుటుంబీకులు కథనం ప్రకారం... తల్లిదండ్రులు సోమవారం వ్యవసాయ పనుల నిమిత్తం పనికి వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చేలోగా అమ్మాయి సురేఖ(19) ఇంట్లో కనబడకపోయేసరికి, చుట్టుపక్కల ఇళ్లలో బంధువుల వద్ద వెదికినా ఫలితం లేకపోవడంతో మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో తల్లిదండ్రులు చాకలి పోచమ్మ భర్త ఆంజనేయులు ఫిర్యాదు చేశారు. అదృశ్యమైన అమాంమయి తల్లిదంనరడుల ఫిర్యాధు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ బీ లింగం తెలిపారు.



మాట్లాడుతున్న అదనపు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సరస్వతి

## ఘనంగా ఇందిరా మహిళా శక్తి సంబరాలు

### పాల్గొన్న అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సరస్వతి

**నర్సాపూర్, జూలై 8, ప్రభాతవార్త:** రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళా శక్తి సంబరాలు మంగళవారం మండల సమైక్య ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సరస్వతి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ మహిళలు సంస్థాగత నిర్మాణంలో, ఆర్థిక చేకూర్పులో, వ్యవసాయ ఆధారిత, వ్యవసాయేతర జీవనోపాదులలో, మానవ అభివృద్ధిలాంటి అంశాలపై గత ఆర్థిక సంవత్సరంలో సాధించిన ప్రగతి, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సాధించాల్సిన ప్రణాళిక పై సభ్యులకు వివరించారు ప్రతి గ్రామంలోసంఘాలలో లేని వారిని సంఘాల్లో చేర్పించడం, కిషోర బాలికలతో, వికలాంగుల సంఘాలు ఏర్పాటు చేయడం, 60 సంవత్సరాలు దాటిన వృద్ధులతో సంఘాలు ఏర్పాటు చేయడం పై అవగాహన కల్గించి 30 రోజుల్లో సంఘాలు చేయాలని కోరారు. దీని ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా కోటి మంది మహిళలు సంఘాల్లో ఉండడంతో కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలన్న దిశగా ముఖ్యమంత్రి ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎంపిడివో మధులత మాట్లాడుతూ మహిళా సంఘాల్లో ఉన్న మహిళలు ఆర్థికంగా సామాజికంగా ఆరోగ్యపరంగా ఎదగాలని ఆత్మస్థైర్యంతో ఉండాలని కొత్త కొత్త జీవనోపాదులు చేపడుతూ వాటి ద్వారా మిగతా సంఘాల సభ్యుల ఆదర్శంగా ఉంటూ మీకంటూ ప్రత్యేకమైన గుర్తింపు వచ్చేలా నిజాయితీగా గ్రామ సంఘాల బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. ఏపిఎం గౌరీ శంకర్ మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరం సాధించిన ప్రగతి తోపాటు ప్రస్తుత సంవత్సరం ప్రణాళిక చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో బాగంగా పాటలు రంగవల్లులు నిర్వహించారు. ఈ మేరకు మండలంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళా సంఘాల సభ్యులకి ఎంపీడీవో మధులత చే సన్మానం చేయించడం జరిగింది. అంతేకాక విజన్ ఐ పి ఓ ఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకి మండల సమాఖ్య ఓబీ మెంబర్లు సుమలత, మోనిక, జ్యోతి లు పళ్ళు పంపిణీ చేశారు..ఈ సమావేశానికి జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సరస్వతి,మండల పరిషత్ అభివృద్ధి అధికారి మధులత, ఏపీఎం గౌరీ శంకర్, దత్తు, సీసీలు దేవీ సింగ్, ఆంజనేయులు, ప్రవీణ, భాగ్య, రవీందర్ ,సమత, మండల సమాఖ్య అధ్యక్ష కార్యదర్శి కోశాధికారులు సుమలత మోనిక జ్యోతి చింతల లక్ష్మి ‍ ్మ ఆపరేటర్ సురేష్ అకౌంటెంట్ మల్లేశం గ్రామ సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

## ఈవో, దేవాలయ సిబ్బందిపై దాడి హేయం

**కొమురవెల్లి, జూలై 8, ప్రభాతవార్త :** భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానానికి సంబంధించిన పురుషోత్తపట్నం గ్రామంలో భూములు కాపాడుకోవడానికి వెళ్లిన ఈవో రమాదేవితోపాటు సిబ్బందిపై జరిగిన దాడిని కొమురవెల్లి శ్రీ మల్లిఖార్జున స్వామి ఉద్యోగుల సంఘం తీవ్రంగా ఖండించారు. మంగళవారం వారు మాట్లాడుతూ దేవాలయానికి సంబంధించిన భూములు కాపాడుకునేందుకు వెల్లిన వారిపై దాడి హేయమైన చర్య అన్నారు. కార్యక్రమంలో ఆలయ యూనియన్ అధ్యక్షులు ఆంజనేయులు, ఏ ఈ శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీరాములు, సురేందర్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు మల్లిఖార్జునతో పాటు తదితరులు ఉన్నారు.

# భూ కబ్జాపై రఘునందన్‌రావు ఎందుకు స్పందించడంలేదు ?

### ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

**గజ్వేల్, జూలై 8 (ప్రభాతవార్త):** దుబ్బాక నియోజకవర్గంలోని చౌదర్‌పల్లి గ్రామంలో సుమారు 176 ఎకరాల పేద ప్రజల అసైన్డ్ భూమిని కబ్జాచేసి కాంగ్రెస్ ప్రభుత్వం అండదండలతో పట్టా భూమిగా తన కుటుంబ సభ్యులపై మార్చుకున్న బిజెపి ఎంపి రఘునందన్‌రావు భూ కబ్జాపై ఎందుకు స్పందించడంలేదని గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్రంలో మోడి, రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ఇద్దరూ కేంద్ర,రాష్ట్రాలను దోచుకుంటున్నారన్నారు. సోషల్ మీడియాలో రఘునందన్‌రావు భూమి కబ్జా చేసిండని పెద్దఎత్తున ప్రచారం జరుగుతున్నా ఇప్పటి వరకు ప్రెస్‌మీట్ పెట్టి వివరణ ఇవ్వకుండా మొహం చాటేశారన్నారు. రఘునందన్‌రావు భూమి కబ్జా పెట్టలేదని ఎక్కడ ఖండించిన దాఖలాలు లేవన్నారు. ఒకవేళ భూమిని కబ్జా చేస్తే పేద ప్రజలకు అందించాలని, లేనిపక్షంలో అధికారులకు అప్పగించాలన్నారు. భూమి కబ్జా చేస్తున్నాడనే విమర్శలతో పార్లమెంట్ సభ్యత్వానికి మచ్చ తెస్తూ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారన్నారు. ప్రజలు నిన్ను నమ్మి ఓట్లు వేసి పార్లమెంట్‌కు పంపిస్తే పేద ప్రజల భూమిని కబ్జా చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. కాంగ్రెస్, బిజెపి అంటేనే స్కాములు, కమీషన్లు, అవినీతి, భూ కబ్జాలు అని విమర్శించారు. బిజెపిలో ఎంపిగా గెలిచి సంవత్సరం గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం నుండి గజ్వేల్ నియోజకవర్గానికి ఒక్క రూపాయి కూడా అభివృద్ధి చేసిన దాఖలాలు లేవన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను దివాలా తీయించిన ఘనత బిజెపి, కాంగ్రెస్‌లదే అన్నారు.

ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, యువజన విభాగం అధ్యక్షుడు గడియారం స్వామిచారి, గుంటుకు రాజు, మర్కంటి కనకయ్య, మాజీ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్‌గుప్త, కో-ఆప్షన్ మెంబర్ కుమార్, నాయకులు మహ్మద్, తోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

## ఇసుక అక్రమ రవాణాపై ఇంటెలిజన్స్ ఆరా...!

### విచారణకు ఆదేశించిన సిద్దిపేట పోలీస్ కమిషనర్

**హుస్నాబాద్ రూరల్, జూలై 8, ప్రభాతవార్త :** ఇసుక అక్రమ రవాణా విషయంలో 'ప్రభాతవార్త'లో వరుస కథనాలు ప్రచురితం కావడంతో హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాల్లో అక్రమార్కులతో కుమ్మక్కైన రెవెన్యూ, పోలీస్ అధికారులపై సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధరెడ్డి ఇంటలిజన్స్ అధికారులతోపాటు సిద్దిపేట స్పెషల్ బ్రాంచ్ పోలీసులతో విచారణకు ఆదేశించినట్లు విశ్వసనీయ సమాచారం మేరకు తెలుస్తోంది. అయితే ఇసుక అక్రమ రవాణా విషయంలో రెవెన్యూ, పోలీస్ అధికారులు కుమ్మక్కై అక్రమార్కులకు కొమ్ముకాస్తూ వారికి అండగా నిలిచి ప్రోత్సహిస్తున్నారని పెద్దఎత్తున ఆరోపణలు రావడంతో ఈ విషయంలో పోలీస్ కమిషనర్‌తోపాటు జిల్లా కలెక్టర్ హైమావతి సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో సిద్దిపేట ఇంటలిజన్సి, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు మంగళవారం హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేటకు విడివిడిగా వెళ్లి విచారణ సాగించినట్లు తెలిసింది. అయితే ఈ విచారణలో అక్రమార్కులతో కుమ్మక్కైన అధికారుల వివరాలను సేకరించారా లేదా అనే విషయం తెలియాల్సి ఉండగా వారి వివరాలు తెలిస్తే వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు.. అసలు వారిపై ఉన్నతాధికారులు వేటు వేస్తారా లేదా అనే విషయంలో సందిగ్ధం నెలకొంది. ఏది ఏమైనా అక్రమార్కులకు కొమ్ము కాస్తూ ప్రజాధనం దుర్వినియోగం చేయడంతో పాటు ప్రజలపై ఆర్థిక భారం మోపుతున్న అధికారులు ఎంతటి వారైనా వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఈ ప్రాంత మేధావులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.




వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

## చోరీ కేసులో నిందితుల అరెస్టు

### రూ. ఆరు లక్షల సొత్తు రికవరీ

**సంగారెడ్డి బ్యూరో, జూలై 8, ప్రభాతవార్త :** మహిళను మోసం చేసి ఆమె నుండి బంగారము వెండి అపహరించిన నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు మెదక్ ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెదక్ పట్టణంలో ఎల్లవా అనే మహిళను మద్యం తాగించి ఆమె మెడలోని తులం బంగారం గుండ్లు, ఒకటిన్నర గ్రాముల బంగారం కమ్మలు, 60 తులాల వెండి కడియాలను మోసగించి దొంగతనం చేసిన కేసులు నిందితులైన కుమ్మరి శివకుమార్, పి వరలక్ష్మి ‍ ్మ, బడనాపురం పెంటయ్య లను అరెస్టు చేసి రిమాండ్కు పంపినట్లు ఆయన తెలిపారు. మొత్తం ఆరు లక్షల విలువగల సొత్తును రికవరీ చేసినట్లు ఆయన తెలిపారు సమావేశంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, మెదక్ టౌన్ ఇన్స్పెక్టర్ మహేష్ ఎస్సై అమర్ సిబ్బంది పాల్గొన్నారు.

## పంచాయతీ బోరు స్టార్టర్‌కు నిప్పు



కామారంలో బోరు స్టాటర్ కాలిపోయిన దృశ్యం

**చిన్నశంకరంపేట, జూలై 8,ప్రభాతవార్త:** పంచాయతీ బోరు స్టాటర్‌కు గుర్తుతెలియని దుండగులు నిప్పు పెట్టిన సంఘటన మండల పరిధి కామారం గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామానికి నీళ్లు అందించే బోరు మోటార్ నడవకపోవడంతో పంచాయతీ సిబ్బంది ఉదయం స్టాటర్ వద్దకు వెళ్లి చూడగా అది కాలిపోయి ఉండటాన్ని గమనించి కార్యదర్శికి సమాచారం అందించారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టి ఉంటారని, బోరు నీళ్లు ఉన్నప్పుడు స్టాటర్ ఎక్కడ కూడ కాలిపోయే ప్రస్తకి లేదని పంచాయతీ కార్యదర్శి సుహాసిని తెలిపారు. పంచాయతీ ఆస్తులను ధ్వంసం చేయడం సరికాదని, గ్రామంలో విచారించాక తదుపరి చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

## పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్, పోలీసుల దాడి

### -రూ. 9,700 నగదు, 5 మొబైల్ ఫోన్‌లు స్వాధీనం

**గజ్వేల్ టౌన్, జూలై 8 (ప్రభాతవార్త):** గజ్వేల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోమటిబండ గ్రామ శివారులో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతుండగా నమ్మదగిన సమాచారంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, గజ్వేల్ పోలీసులు దాడిచేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి రూ.9,700 నగదుతోపాటు 5 మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వారిలో కోమటిబండ గ్రామానికి చెందిన ఆర్సు నవీన్, పల్లెపు సురేష్, వల్లపు కనకయ్య, పల్లెపు రాజు, పల్లెపు రాజు ఉన్నారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ అధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో, పట్టణాల్లోని ఫాంహౌస్‌లలో, ఇళ్లలో, బహిరంగ ప్రదేశాలలో పేకాట, ఇతర చట్ట వ్యతిరేక కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే వెంటనే సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ అధికారులకు 8712667445, 8712667446, 8712667447 నెంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు.

**దేవేంద్రనగర్‌లో...**

**హుస్నాబాద్ రూరల్, జూలై 8, ప్రభాతవార్త :** పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న 11 మందితో పాటు రూ 43 వేలతో పాటు 9సెల్‌ఫోన్లు, 9 ద్విచక్ర వాహనాలు స్వాదీనం చేసుకున్న సంఘటన హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవేంద్రనగర్ లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే దేవేంద్రనగర్‌లోని వద్లూరి లక్ష్మన్ అనే వ్యక్తి పశువుల కొట్టాంలో కొంత మంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీస్ అధికారులు ,స్థానిక పోలీసులతో కలిసి వెళ్లి రైడ్ చేసి పది మందిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పేకాట ఆడిన వారి వివరాలను వెల్లడించారు. పేకాట ఆడిన వారిలో దొంతనవేని ఐలయ్య, బోర శ్రీనివాస్, చెన్నూరి శ్రీనివాస్, కుట్ల రాజయ్య, బాసవేని సాగర్, ఐపాక శ్రీనివాస్, పత్రి మహేందర్, మహ్మద్ షబ్బీర్, వంటడుపుల వెంకటస్వామిలతో పాటు పొట్లపల్లి గ్రామానికి చెందిన తూర్పాటి అనిల్ వద్లూరు లక్ష్మణ్‌లు ఉన్నారని గ్రామాలలో, పట్టణాలలో ఎవరైనా ఫాం హౌజ్‌లు , ఇళ్లలో, బహిరంగ ప్రదేశాలలో పేకాట ఆడినా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా వెంటనే 8712667445, 8712667446, 871266744 నంబర్‌లకు సమాచారం అందించాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

## పంచాయతీ కార్మికుడిని ప్రభుత్వం ఆదుకోవాలి

**-పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి**
**-ఎఐటియుసి జిల్లా నాయకులు చిరంజీవి**



మాట్లాడుతున్న ఎఐటియుసి జిల్లా నాయకులు చిరంజీవి

**సిర్గాపూర్, జూలై 8, ప్రభాతవార్త:**
విధి నిర్వాహణలో మృతిచెందిన నల్లవాగు గ్రామ పంచాయతీ కార్మికుడు రాములును ప్రభుత్వం ఆదుకోవాలని, పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఎఐటియుజి జిల్లా నాయకులు చిరంజీవి డిమాండ్ చేశారు. మంగళవారం చిరంజీవి మాట్లాడుతూ మంగళవారం ఉదయం పంచాయతీ కార్మికుడు రాములు మంచినీరు సరఫరా చేస్తున్న క్రమంలో అక్కడే పడిపోయి కానరానిలోకాలకు చేరిపోయాడని విచారం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యం మూలంగా కార్మికుడు రాములు చనిపోయాడని ఆరోపించారు. పంచాయతీ కార్మికుడు రాములుకు ప్రభుత్వం 10లక్షల రూపాయల పరిహారం అందించడంతో పాటు కార్యదర్శిపై కేసు నమోదు చేసి కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన చేపట్టాల్సి వస్తుందని చిరంజీవి హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు ఆనంద్, అశోక్, ప్రేమ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## తహసీల్దార్‌ను సన్మానించిన కాంగ్రెస్‌నేతలు



చిన్నశంకరంపేట తహసీల్దార్ సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**చిన్నశంకరంపేట, జూలై 8, ప్రభాతవార్త:**
చిన్నశంకరంపేట మండల నూతన తహసీల్దారు మాలతిని మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు సాన సత్యనారాయణ ఆధ్వర్యంలో కలిసి, శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షులు సాన సత్యనారాయణ మాట్లాడుతూ పేద ప్రజలకు అండగా నిలుస్తూ తమ విధులు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు మనోజ్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్, తీగుళ్ల బిక్షపతి, అశోక్, రవి తదితరులు పాల్గొన్నారు.

**విద్యావనరుల కేంద్రం ఆధ్వర్యంలో...**
తహసీల్దార్‌గా చిన్నశంకరంపేటకు బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ మాలతిని మండల విద్యావనరుల కేంద్రం సిబ్బంది శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సన్మానించినవారిలో అమృతరాణి, దామోదర్, ప్రతాప్, లక్ష్మి తదితరులున్నారు.

## నేడు సమ్మెను జయప్రదం చేయండి

**-ప్రచార జాతలో సిఐటియు రాష్ట్ర నేత కె.రాజయ్య పిలుపు**




రథంతో ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు

**గుమ్మడిదల, జూలై 8, ప్రభాతవార్త:**
వివిధ కార్మిక సంఘాలు ఉద్యోగ, ఉపాధ్యాయ ఫెడరేషన్లు, పబ్లిక్ సెక్టార్, రైతుసంఘాలు, కూలీసంఘాలు తలపెట్టిన కార్మికుల సమ్మెను, గ్రామీణ బంధును జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్రనేత పిలుపునిచ్చారు. గుమ్మడిదల పురపాలకసంఘం మండలపరిధిలో ప్రచారజాత నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమ్మెతో కేంద్రప్రభుత్వం దిమ్మ తిరగాలని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వము ప్రజావ్యతిరేక నిర్ణయాలు అమలుచేయకూడదని ఆయన డిమాండ్ చేశారు, లేబర్‌కోడులను కూడా తక్షణమే రద్దుచేయాలని ఆయన అన్నారు. ప్రభుత్వ రంగాన్ని, ప్రైవేటు చేయొద్దని, పెరిగే ధరలను అరికట్టాలని, ఉద్యోగ పోస్టులను అన్నిటిని భర్తీచేయాలని, అవినీతిని అరికట్టాలని, రైతన్నకు గిట్టుబాటుధరలు చెల్లించాలని, భూములను బలవంతంగా తీసుకోకూడదని, కార్మికులు కనీస వేతనం రూ.26,000 నిర్ణయించాలని, స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని, అందరినీ పెర్మనెంట్ చేయాలని, ఆయన డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో శ్రీధర్‌రావు, దేవేందర్, హుస్సేన్, రవి, రవీందర్‌చారి, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోండి

**-విద్యుత్ ఎడిఈకి వినతిపత్రం ఇచ్చిన బిజెపి నాయకులు**



విద్యుత్ ఎడిఈ రమణారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న బిజెపి నాయకులు

**నర్సాపూర్ జూలై 8, ప్రభాతవార్త:**
నర్సాపూర్ పట్టణంలో ప్రతిరోజు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈమేరకు విద్యుత్‌లో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని నర్సాపూర్ విద్యుత్ శాఖ ఎడిఈ రమణారెడ్డికి మంగళవారం బిజెపి నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నర్సాపూర్ పట్టణంలో ప్రతిరోజు విద్యుత్‌కు అంతరాయం కలగడంతో పట్టణప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యుత్ లేక ఇళ్లలో తాగునీటికి ఇతర అవసరాలకు ఎన్నో ఇబ్బందులు కలుగుతున్నాయి అన్నారు. విద్యుత్‌సరఫరా సరిగాలేకపోవడంతో సొంతపనులన్నీ నిలిచిపోతున్నాయని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ ఎడిఈ రమణారెడ్డి స్పందించి విద్యుత్‌కు అంతరాయం కలగకుండా నిరంతరంగా విద్యుత్ సరఫరాచేసి పట్టణప్రజల ఇబ్బందులు తొలగించాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్‌లు బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి గోడ రాజేందర్, ఎర్రగొల్ల రమేష్‌యాదవ్, చూడు నీరుడు చంద్రయ్య, పట్టణ కార్యదర్శులు సంఘసాని రాజు, బోర్వెల్ రామ్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బాదే బాలరాజ్, ఎస్సి మోర్చా అధ్యక్షుడు బబ్బురి కృష్ణ, భూత అధ్యక్షుడు సంగమేశ్, దుర్గాప్రసాద్, మహేందర్‌గౌడ్, మల్లేష్‌తోపాటు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజలు చేసిన కాంగ్రెస్ నాయకులు

**-కాంగ్రెస్‌ప్రభుత్వం ఇచ్చినమాట ప్రకారం పేదప్రజలకు ఇళ్లు మంజూరు**
**-జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి**



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజలు చేసిన కాంగ్రెస్ నాయకులు తదితరులు

**నర్సాపూర్, జూలై 8, ప్రభాతవార్త:**
కాంగ్రెస్‌ప్రభుత్వం ఎన్నికలముందు ఇచ్చినహామీ మేరకు పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరుచేసిందని అలాగే మంజూరైన ఇళ్లకు భూమి పూజలు సైతం చేస్తున్నట్లు కాంగ్రెస్‌పార్టీ మెదక్‌జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి తెలిపారు. మంగళవారం నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని ఒకటో వార్డు హనుమంతపూర్‌లో పలువురికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు కొబ్బరికాయలు కొట్టి భూమిపూజలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇల్లులేని నిరుపేదలు గత కొన్నేళ్లుగా సొంత ఇంటికోసం ఎదురుచూస్తున్న లబ్దిదారులు నేడు కాంగ్రెస్‌ప్రభుత్వం మంజూరుచేసిన ఇందిరమ్మ ఇళ్లతో నిరుపేదల కల నెరవేరింది అన్నారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల వారి నమ్మకానికి శ్రమల పట్ల సంతృప్తికి నిదర్శనం అన్నారు. ప్రజల ఆశలకు అవసరాలకు తోడుగా నిలుస్తున్న ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని వారు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తామని మాయమాటలు చెప్పి రెండు పర్యాయాలు అధికారంలో ఉన్నా డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వక మోసంచేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినమాట ప్రకారం నిరుపేదలకు మంజూరు చేసి ఇందిరమ్మ ఇళ్లనిర్మాణాలకు సైతం భూమి పూజలు చేయడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్రనాయకులు సోమన్నగారి రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపిపిలు జ్యోతి సురేష్‌నాయక్, శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షులు రిజ్వాన్, పట్టణ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, మండల అధ్యక్షుడు గుర్రాల మల్లేశం, పిఏసిఎస్ చైర్మన్ రాజుయాదవ్, పిఏసిఎస్ డైరక్టర్ కమ్మరి కృపాచారి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తరుణ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సందీప్, మండల ఓబిసి సెల్ అధ్యక్షులు రెడ్డిపల్లి అశోక్‌గౌడ్, నాయకులు దాటిన నరేష్, సందీప్, మండల మైనార్టీ అధ్యక్షులు అజ్మత్, రుస్తుంపేట మాజీ ఎంపిటిసి అశోక్, మలేష్‌యాదవ్, శ్రీశైలంయాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## త్రవ్వి వదిలేసిన మిషన్ భగీరథ అధికారులు



మిషన్ భగీరథ పైప్‌లైన్ కోసం త్రవ్వి వదిలేసిన కాలువ

**పాపన్నపేట, జూలై 8, ప్రభాతవార్త:**
పావన్నపేట మండలం లింగాయవల్లి సబ్‌స్టేషన్ దగ్గర మిషన్ భగీరథ అధికారులు పైప్‌లైన్ మరమ్మతుల కోసం త్రవ్వి వదిలేయడంతో, వలువురు ప్రయాణికులు ప్రమాదాల పాలవుతున్నారు. ప్రధాన చౌరస్తాలో ఏర్పడిన కాలువలోపడి మూగ జంతువులు, పలువురు ప్రయాణికులు గాయాల పాలవుతున్నారు. రాత్రిపూట గుంత కనిపించక పోవడంతో ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని, మండలవాసులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని, సొసైటీ చైర్మన్ దత్తురాజ్, యువజన సంఘ సభ్యులు మోహన్ తదితరులు వాపోయారు.

## ఓటరు జాబితా తయారీలో బూత్ లెవెల్ అధికారుల పాత్ర కీలకం

**మెదక్ ఆర్డీవో రమాదేవి**




మాట్లాడుతున్న ఆర్డీవో రమాదేవి

**పాపన్నపేట, జూలై 8, ప్రభాతవార్త:**
ఓటర్ జాబితా తయారీలో బూత్ లెవెల్ అధికారుల పాత్ర ఎంతో కీలకమని మెదక్ ఆర్డీఓ రమాదేవి అన్నారు. మంగళవారం ఆమె మండల కేంద్రమైన పాపన్నపేటలోని ఉన్నత పాఠశాలలో బిఎల్ఓలకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా పాపన్నపేట తహసీల్దార్ సతీష్‌తో కలిసి మాట్లాడారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఓటరుజాబితాతయారీలో బూత్ లెవెల్ అధికారుల పాత్ర కీలకం అని అన్నారు. కేటాయించిన పోలింగ్ స్టేషన్ పరిధిలోని అన్ని ఇళ్లను సర్వేచేసి, కొత్త ఓటరులను నమోదు చేయాలని, ఓటరు జాబితాలో ఏమైనా తప్పులు ఉంటే సరిచేయాలని అన్నారు. అన్ని రకాల విషయాలను యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ సతీష్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ చరణ్, ఆర్ఐ నాగరాజు, మాస్టర్ ట్రైనర్స్ సత్యనారాయణరెడ్డి, వరప్రసాద్, అంజాగౌడ్, నర్సింహులు, దేవిసింగ్, పాపన్నపేట ఈవో నయీమ్, సూపర్‌వైజర్లు కరణం కవిత, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం

**చిన్నశంకరంపేట, జూలై 8, ప్రభాతవార్త:**
మండలపరిధి చందంపేటలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మెడిసిటీ ఆసుపత్రి వారి సౌజన్యంతో నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిబిరం 115మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. 25మందికి శస్త్రచికిత్సలు అవసరమని, వారిని ఆసుపత్రికి తరలించి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయిస్తామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో మాజీసర్పంచి శ్రీలత, మాజీ ఎంపిటిసి శివకుమార్, పంచాయతీ కార్యదర్శి పద్మ, వైద్యులు పూజిత, సంఘవి, ఓంకార్, కుమార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## కరెంటుతోనే సేవలు... కరెంటు పోతే...



బ్యాంకు ముందు నిరసన వ్యక్తంచేస్తున్న రైతులు

**చిన్నశంకరంపేట, జూలై 8, ప్రభాతవార్త:**
ఆ బ్యాంకులో విద్యుత్తు ఉంటేనే ఖాతాదారులకు సేవలు అందుతాయి. లేకపోతే ఇబ్బందులు పడాల్సిందే. మండలపరిధి మదూర్‌లోని యూనియన్ బ్యాంకులో విద్యుత్తు లేకపోవడంతో ఖాతాదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మంగళవారం ఉదయం వృద్ధులు పించన్ కోసం రైతులు ప్రభుత్వం నుండి వచ్చిన పంట సహాయం నగదును తీసుకోవడానికి బ్యాంకుకు వెళ్లారు. అక్కడికి వెళ్లాక విద్యుత్తులేదు. ఇప్పుడు సేవలు అందించలేమని సిబ్బంది చేతులెత్తేయడంతో బ్యాంకు ముందు నిరసన వ్యక్తం చేశారు. చిన్నచిన్న ప్రయివేటుబ్యాంకుల్లో విద్యుత్తు లేకపోతే వాటికి ప్రత్యామ్నాయంగా జనరేటర్‌ను ఏర్పాటుచేసుకొని సేవలను అందిస్తున్నారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన యూనియన్ బ్యాంకులో జనరేటర్ లేకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఈబ్యాంకులో సుమారు 15గ్రామాలకుపైగా ఖాతాదారులుంటారు. ఈ విషయమై బ్యాంకు అధికారి విశ్వనాథ్‌ను వార్త వివరణ కోరగా... జనరేటర్ లేకపోవడంవల్ల ఖాతాదారులకు సేవలు అందించలేకపోతున్నామని, విద్యుత్తు ఉన్నప్పుడే సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. జనరేటర్ ఏర్పాటు చేయాలని పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. యూనియన్ బ్యాంకులో నిత్యం ఇదేసమస్యతో ఇబ్బందులు పడుతున్నామని వివిధ గ్రామాల ప్రజలు అసంతృప్తి వ్యక్తంచేశారు.

## కబ్జాకు గురవుతున్న శిఖం భూమిని కాపాడాలని ఆర్డీవోకు వినతి



కబ్జాకు గురవుతున్న శిఖంభూమిని కాపాడాలని ఆర్డీవో మహిపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నత్నాయపల్లి గ్రామస్థులు

**నర్సాపూర్, జూలై 8, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మండలపరిధిలోని నత్నాయపల్లి గ్రామంలోగల సాయన్నకుంట 110సర్వేనెంబర్‌లోని శిఖంభూమి కొందరు ఆక్రమించి కబ్జా చేస్తున్నారని ఆభూమిని కాపాడాలని నత్నాయపల్లిగ్రామానికి చెందిన పలువురు నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. మంగళవారం నత్నాయపల్లిగ్రామానికి చెందిన నీలి నాగేష్, తోట్ల ఎల్లం, మీసాల కృష్ణ, అండూర్ గణేష్, మాజీసర్పంచ్ సాయమ్మ సత్యనారాయణ తదితరులు సాయన్నకుంట సర్వేనెంబర్110లోని 2ఎకరాలకు పైగా ఉన్న ఈ శిఖంభూమిలో 20 గుంటల భూమి కబ్జాకు గురైందన్నారు. కబ్జాకు గురైన భూమిని కాపాడాలని కోరుతూ నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాయన్నకుంట శిఖంభూమిలో కొందరు అక్రమంగా వచ్చి 20గుంటల భూమిని కబ్జా చేశారని అన్నారు. భూ ఆక్రమణదారుల నుండి ఈభూమిని కాపాడి ఇందుకు బాధ్యులైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో మహిపాల్‌రెడ్డికి ఇచ్చిన ఫిర్యాదులో నత్నాయపల్లి గ్రామస్థులు పేర్కొన్నారు.

# ఆయిల్ పామ్ సాగుతో అధికలాభాలు

**-అవగాహన సదస్సులో రైతులతో ఉద్యానవనశాఖ అధికారులు**



ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానవనశాఖ అధికారులు

**పుల్‌కల్, జూలై 8, ప్రభాతవార్త:**
ఆయిల్ పామ్ పంటను సాగు చేసి ఆర్థికంగా ప్రతి రైతు స్థిరపడాలని ఉద్యానవన శాఖ అధికారులు సూచించారు. మంగళవారం మండల కేంద్రమైన పుల్‌కల్‌లోని రైతువేదికలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ పంట సాగుకు ప్రభుత్వం ఎకరా మొక్కలకు 11600 రూపాయలు, మెయింటెనెన్స్‌కు 16800 రూపాయలు, డ్రిప్ ఇరిగేషన్‌కు 22వేల రూపాయలను సబ్సిడీగా అందచేస్తోందన్నారు. అన్నిరకాల నేలల్లో ఆయిల్ పామ్ పంట సాగవుతుందన్నారు. ఎకరా భూమిలో 57మొక్కలు నాటుకోవాలని, మొక్క నాటే ముందు డ్రిప్ ఏర్పాటు చేసుకోవాలని, ఒకొక్క గుంతలో 400 గ్రాముల సింగిల్ సూపర్ ఫాస్పేట్, 50గ్రాముల ఫోరేట్ గుళికలు వేయాలన్నారు. మొదటి దఫా ఎరువులను నాటిన మూడు నెలలకు తర్వాత వేసుకోవాలన్నారు. రెండవ దఫా ఎరువులతో పాటు 50నుంచి 100 కిలోగ్రాముల పశువుల ఎరువు, 5కిలోగ్రాముల వేపపిండిని కలిపి వేసుకోవాలన్నారు. ఏడాదికి ఒక చెట్టుకు 30 కిలోల యూరియా, 30కిలోల పొటాష్ ఎరువులను వినియోగించాలన్నారు. ఎరువులను నాలుగు భాగాలుగా విభజించి మూడు నెలలకు ఒక సారి వేసుకోవాలన్నారు. ఆయిల్‌పామ్ తోటలో మొక్కల మధ్య దూరం ఎక్కువగా ఉంటుందని, అందుకు మొదటి 3సంవత్సరాల వరకు అంతర్‌పంటలను సాగు చేసుకోవచ్చన్నారు. ఆయిల్ పామ్ మొక్కలు నాటిన 14 నుంచి 18 నెలల తర్వాత పూతకు వస్తాయని, చెట్టు తొలి దశలో వచ్చే మగ పూల గుత్తులను వెంటనే తుంచి వేయాలన్నారు. గెలల దిగుబడి మొక్కలు నాటిన 4వ సంవత్సరం నుంచి ప్రారంభమయి 7వ సంవత్సరం వరకు పెరుగుతూ ఉంటాయన్నారు. 8వ సంవత్సరం నుంచి నిలకడగా ఎకరానికి సగటున 8నుంచి 10టన్నుల పామ్ ఆయిల్ గెలల దిగుబడి వస్తుందన్నారు. పూల తోటలు, ఉల్లిగడ్డవేసుకున్న రైతులకు ఎకరాకు8వేల రూపాయల రాయితీ ఇవ్వడం జరగుతుందన్నారు. రతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. రైతులు తమ ఆధార్‌కార్డు, పట్టా పాసు పుస్తకం, బ్యాంక్ ఖాతా పుస్తకం, పాస్‌పోర్టు సైజ్ పోటోలు అందించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అందోల్ మండల ఆత్మ కమిటీ డైరెక్టర్ మన్నే విఠల్, మండల వ్యవసాయ అధికారి చైతన్య, పుల్‌కల్ క్లస్టర్ ఏఈఓ అంజుమ్, మండల ఉద్యానవన శాఖ అధికారి సమత, గోద్రేజ్ ఆయిల్ పామ్ ఎంప్లాయ్ శివరాం, రైతులు యాదగౌడ్ వెంటయ్య, మొగులయ్య పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ సిఎం జయంతి వేడుకలు



వైఎస్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న నాయకులు

**చేర్యాల, జూలై 8, ప్రభాతవార్త:**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు దాసరి శ్రీకాంత్, పూర్మ ఆగంరెడ్డి, దాసరి కళావతి, వంగ జయ, గుస్క వసంత, తడక లింగం, రాగుళ శ్రీనివాస్‌రెడ్డి, ఎండి జహిరొద్దిన్, నాగరాజు, అంబాల రాములు, తాటికొండ సదానందం, ఖాత శ్రీనివాస్, చింతల మల్లేశం, నాగేంద్రబాబు, పచ్చిమడ్ల వెంకటయ్య, మిట్టపల్లి నర్సిరెడ్డి, బుట్టి బిక్షపతి, బండి శ్రీనివాస్, సుద్దాల లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన చేర్యాల జెఎసి నాయకులు



ఎమ్మెల్యేను పరామర్శిస్తున్న జెఎసి నాయకులు

**చేర్యాల, జూలై 8, ప్రభాతవార్త:**
ఇటీవల ప్రమాదానికి గురై చికిత్స అనంతరం ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని చేర్యాల జెఎసి నాయకులు కలిసి పరామర్శించారు. మంగళవారం హైద్రబాద్‌లోని ఎమ్మెల్యేనివాసంలో ఆయననుకలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగాకోలుకుని ప్రజాక్షేత్రంలోకిరావాలని వారు ఆకాంక్షించారు. నాయకులు డాక్టర్ రామగళ్ళ పరమేశ్వర్, అందె బీరన్న, మల్లిగారి యాదయ్య, బుట్టి సత్యనారాయణ, రామగళ్ల నరేష్, ఇసాక్, ఇన్నారెడ్డి తదితరులున్నారు.

## విద్యాప్రమాణాల పెంపునకు సహకారం అందించాలి

**-ఎంఈఓ నాగారం శ్రీనివాస్**

**సిర్గాపూర్, జూలై 8, ప్రభాతవార్త:**
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాల మెరుగుదలకు దాతలు ముందుకు రావాల్సిన అవసరం ఉందని మండల విద్యాధికారి నాగారం శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని బొక్కస్‌గావ్‌లోని యుపిఎస్ పాఠశాలలో విద్యను అందుకుంటున్న విద్యార్థులకు హెల్పింగ్ హ్యాండ్ ఫర్‌పూర్‌పీపుల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్‌కిట్స్, విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంఈఓ నాగారం శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరు తమ వంతు కృషిచేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యను విద్యార్థులు అందుకుంటారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింగ్, సిఆర్‌పి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన ఎంపిడివో



ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న ఎంపిడివో దామోదర్

**చిన్నశంకరంపేట, జూలై 8, ప్రభాతవార్త:**
మండలపరిధి గవ్వలపల్లిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను ఎంపిడివో దామోదర్ మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపత్రాలను అందించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఇళ్లనిర్మాణాలు కొనసాగుతున్నాయన్నారు. ఇంటినిర్మాణాలు చేపడుతున్నప్పుడు ఏమైనా సమస్యలుంటే సంప్రతించాలని సూచించారు. ఆయనవెంట పంచాయతీ కార్యదర్శి తదితరులున్నారు.

## వైయస్‌ఆర్ ఆశయాలే మనకు మార్గదర్శకాలు

**-జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి**



వైయస్‌ఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**నర్సాపూర్, జూలై 8, ప్రభాతవార్త:**
దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలే మనకు మార్గదర్శకాలని కాంగ్రెస్‌పార్టీ మెదక్‌జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ నియోజకవర్గఇన్చార్జి ఆవులరాజిరెడ్డి అన్నారు. మంగళవారం దివంగత మాజీముఖ్యమంత్రి వైఎస్‌రాజశేఖర్‌రెడ్డిజయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. చిల్డ్రన్‌పార్కులోని వైయస్‌ఆర్ విగ్రహానికి పూలమాలలువేసి ఘననివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు సోమన్నగారి రవీందర్‌రెడ్డి, జ్యోతిసురేష్‌నాయక్, శ్రీనివాస్‌గౌడ్, రిజ్వాన్, పట్టణాధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, గుర్రాల మల్లేశం, రాజుయాదవ్, కమ్మరి కృపాచారి, తరుణ్, సందీప్, రెడ్డిపల్లి అశోక్‌గౌడ్, నాయకులు దాటిన నరేష్, సందీప్, అజ్మత్, అశోక్, మలేష్‌యాదవ్, శ్రీశైలంయాదవ్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తడి, పొడి చెత్తపై అవగాహన



తడి, పొడిచెత్తపై అవగాహనకల్పిస్తున్న మున్సిపల్ అధికారులు

**నర్సాపూర్, జూలై 8, ప్రభాతవార్త:**
తెలంగాణప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వందరోజుల కార్యక్రమంలో భాగంగా నర్సాపూర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రజలకు తడి చెత్త పొడి చెత్త హానికర చెత్త వేరు చేయడంపై అవగాహన కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ రామ్‌చరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపల్ అధికారులు సిబ్బంది పట్టణంలో పర్యటించి పట్టణ ప్రజలకు తడి చెత్తను, పొడి చెత్తను, హానికర చెత్తను ఏవిధంగా వేరుచేయాలో తెలియజేశారు. అదేవిధంగా సామూహిక పారిశుధ్యం, ప్రజామరుగుదొడ్లను పరిశీలించడం జరిగింది. వేరుచేసిన చెత్త బుట్టలను మున్సిపల్ చెత్తట్రాక్టర్‌లో వేయాలని పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ మధుసూదన్, మహేష్ ఎన్విరాన్మెంట్ ఎఈ శ్రీకాంత్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


మొక్కలునాటుతున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ తదితరులు

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

### మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్

**హుస్నాబాద్ రూరల్, జూలై 8, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటాలని మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 1వవార్డులోగల మినిస్టేడియంలో 100 రోజుల కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడంతోపాటు సంరక్షణ బాధ్యతలు చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు, ఆర్‌పిలు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి సార్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దాం


మాట్లాడుతున్న శెట్టిపల్లి సత్తిరెడ్డి

**కొమురవెల్లి, జూలై 8, ప్రభాతవార్త :** దేశ వ్యాప్తంగా ఈనెల 9న జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులు, రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శెట్టిపల్లి సత్తిరెడ్డి పిలుపునిచ్చారు. కొమురవెల్లి మండలశాఖ సమావేశం మంగళవారం సార్ల నరసింహులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సత్తిరెడ్డి మాట్లాడుతూ, కేంద్రంలోకి మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి సర్కారు కార్మిక చట్టాలను, హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ సంస్థల కొమ్ముకాస్తుందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 9న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం పోరాటం చేయాల్సిన సమయం అసన్నమైందన్నారు. సమావేశంలో నాయకులు రవీందర్, కృష్ణారెడ్డి, యాదయ్య, రవీందర్, కృపాకర్, మల్లయ్య, ఎల్లయ్య, అంజయ్య, శ్రవణాచారి పాల్గొన్నారు.

## నంగునూర్‌లో ఇందిరా మహిళా శక్తి సంబరాలు


మహిళా శక్తి సంబరాల్లో పాల్గొన్న మహిళలు

**నంగునూర్, జూలై 8,ప్రభాతవార్త :** నంగునూర్ మండలానికి శ్రీనిధి రుణ వితరణలో మొదటి బహుమతి రావడం ఎంతో గర్వకారణమని ఎపిఎం మైపాల్ అన్నారు. ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా మంగళవారం మండల సమాఖ్య ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనిధి రుణా వితరణలో నంగునూర్ మండలం జిల్లాలో మొదటిస్థానం సాధించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. శ్రీనిధి రుణాలు గత ఆర్థిక సంవత్సరంలో సుమారు నాలుగు కోట్లు లక్ష్యంగా ఉండగా ఆరు కోట్ల రుణాలు ఇచ్చి మొదటి స్థానంలో నిలిపామన్నారు. కార్యక్రమంలో సీసీలు పంగ లింగం, మల్లేశం, సాయిలు, బాలకిషన్, మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీ, అకౌంటెంట్ బాలరాజు, సీఓ ముజుమ్మిల్, ఆయా గ్రామాల వివో లీడర్లు, వివోఎలు పాల్గొన్నారు.

## ఎఐఎఫ్‌డిఎస్ బలోపేతానికి కృషి చేయాలి

### రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీకాంత్

**హుస్నాబాద్ టౌన్, జూలై 8, ప్రభాతవార్త :** అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య సంఘం బలోపేతానికి కృషి చేయాలని సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం శ్రీకాంత్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో పలు విద్యార్థి సంఘాల నుండి వచ్చిన నాయకులను సంఘంలో చేర్చుకున్నారు. కార్యక్రమంలో నాయకులు అంబాల ఆంజనేయులు, భవన్, మనోహర్, అరవింద్ ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య : ఎంఇవో


మాట్లాడుతున్న ఎంఈఓ కృష్ణ

**గజ్వేల్, జూలై 8 (ప్రభాతవార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తుందని గజ్వేల్ మండల విద్యాధికారి కృష్ణ పేర్కొన్నారు. మంగళవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని పేర్కొన్నారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. గతం లోకంటే ఈ సంవత్సరం విద్యార్థుల సంఖ్య ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిందని తెలిపారు. నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు చక్కటి మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల గురించి తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన మున్సిపల్ కమిషనర్

**గజ్వేల్ టౌన్, జూలై 8 (ప్రభాతవార్త):** వంద రోజుల కార్యక్రమం మరియు వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం క్యాసారం నుండి ప్రజ్ఞాపూర్ డిపో రోడ్డులో మున్సిపల్ కమిషనర్ సిహెచ్.బాలకృష్ణ మొక్కలను నాటించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సిహెచ్.బాలకృష్ణ మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా రోడ్డుకు ఇరువైపులా, ఖాళీ ప్రదేశాలలో మొక్కలను నాటడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్, ఆర్‌వో, ఆర్ఐ, సానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది, ఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.


మొక్కను నాటుతున్న మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ

# బాబాల కన్ను ఆ భూమి పైనే..!!

### వివాదంలో నాడు దత్త బాబా...నేడు అవదూత మహారాజ్



నీలరాజేశ్వర్ నిర్మించిన మందిరానికి ఆశ్రమం బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం

**మునిపల్లి, జూలై 8 (ప్రభాతవార్త):** మునిపల్లి మండలం బుధేరా చౌరస్తా సమీపంలోని జాతీయ రహదారి ప్రక్కనగల 30 సర్వే నెంబరులోగల భూమిపైనే బాబాలు కన్నేశారు. రహదారి పక్కన అందమైన గుట్టలు ఆహ్లాదకరమైన వాతావరణం చూడగానే ఇక్కడి పరిసరాలు ప్రతి ఒక్కరిని ఆకర్షిస్తాయి. దీనికి తోడు జాతీయ రహదారికి ఆనుకొని వుండటంతో కోట్లాది రూపాయల ధర పలుకుతుంది. 2001 సంవత్సరంలో ఆంధ్ర ప్రాంతానికి చెందిన దత్తబాబా అలియాస్ టైలర్ శ్రీనివాస్ ఇదే సర్వే నెంబరులో భూమిని కబ్జా చేశాడు. ఇక్కడ తాత్కాలిక రేకుల షెడ్‌లో హనుమాన్ మదిరం నిర్మించాడు. ఆసుపత్రి, ఆద్యాత్మిక కేంద్రం, ఆనాథ శరణాలయం, వృద్ధాశ్రమం నిర్మాణాలు చేపట్టి బుధేరాను ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతానని అధికారులను నమ్మించి భూమిని కబ్జాచేశాడు. అప్పట్లో అతడి బండారాలు, అరాచకాలపై 'వార్త'దినపత్రికలో ప్రచురితమైన కథనాలు ఉమ్మడి రాష్ట్ర వ్యాప్తంగా సంచనలం సృష్టించాయి. దీంతో గ్రామస్థులు తిరగబడటంతో దత్తబాబాకు భూమి ధారదత్తం చేసిన రెవెన్యూ అధికారిని సస్పెండ్ చేసి ప్రభుత్వం అతడికి ఇచ్చిన పట్టాను రద్దు చేసింది. ఇదిలా వుండగా 2005లో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మెదక్‌లో భూమి లేని పేదలకు పట్టాలిచ్చే కార్యక్రమంలో దత్తబాబా కిచ్చిన స్థలంలో రెండెకరాల చొప్పున బుధేరా కోలుకుందె సరస్వతితోపాటు గ్రామస్థులకు పట్టాలందజేశారు. తనకిచ్చిన రెండుకరాలలో గల భూమిని చదును చేసుకుని వ్యవసాయం చేసుకుంటున్నారు. ఇదే సర్వేనెంబరులో 2012 సంవత్సరం ఫిబ్రవరి 5న ఝరాసంగెం మండలం బర్దీపూర్‌కు చెందిన ఆనందగిరిమాత,చైత్యగిరిలకు రెండెకరాల చొప్పున భూమి పట్టా ఇచ్చారు. అప్పట్లో అసంపూర్తిగా వదిలేసిన హనుమాన్ మందరాన్ని జహీరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త నీలరాజేశ్వర్ పక్కా మందిరాన్ని నిర్మించాడు. అనంతరం బర్దీపూర్ అవధూత మహారాజ్ ఆ గుడికి దత్తగిరి ఆశ్రమం అని బోర్డు ఏర్పాటు చేసి అక్కడ వేద పాఠశాలకు భూమి పూజ కార్యక్రమం చేపట్టారు. మందిరం చుట్టు మొరం వేస్తూ ప్రక్కన గల సరస్వతి భూమిలో గల కంది,ప్రత్తి పంటపై మొరం వేసి కప్పి వేయడంతో సదరు మహిళ తన కుటీంబీకులతో కలసి కలెక్టరుకు ఫిర్యాదు చేశారు.లక్షలాది భక్తుల అభిమానాన్ని చూరగొన్న దత్తగిరి మహారాజ్ ఈ వివాదంలో చిక్కుకోవడం అతని అభిమానులు జీర్ణించుకోలేక పోతున్నారు.రెవెన్యూ అధికారులు కల్పించుకొని ఇరువురికి పొజిషన్ చూపించాలని మండల ప్రజలు కోరుతున్నారు.


మొక్కను నాటుతున్న మండల ప్రత్యేకాధికారి సాగర్

## వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

### -మండల ప్రత్యేకాధికారి సాగర్

**మర్కుక్, జూలై 8 (ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవాన్ని ప్రతి గ్రామంలో విజయవంతంగా చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి ఎం.సాగర్, ఎంపిడిఓ అశోక్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని దామరకుంటలో మొక్కలు నాటి వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వంటిమామిడి మార్కెట్ కమిటీ డైరెక్టర్ పత్తి నర్సింలు, ఈజీఎస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్వాడీ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐని కలిసిన కాంగ్రెస్ నేతలు


ఎస్ఐని సన్మానిస్తున్న దృశ్యం

**అక్కన్నపేట, జూలై 8, ప్రభాతవార్త :** నూతన ఎస్ఐగా బాధ్యతలు తీసుకున్న చాతరాజు ప్రశాంత్‌ను మంగళవారం యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు పాండ్రాల దాము ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిసారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్ఐని కలిసిన వారిలో యూత్ జనరల్ సెక్రటరీ తాళ్ల ప్రశాంత్, ఎస్సి సెల్ నాయకులు సంపత్, రజినీకాంత్, నాయకులు బాలకిషన్, హరీష్, కనుకయ్య, బాలకృష్ణ, వెంకటేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్‌కు ఘన స్వాగతం

**సంగారెడ్డి మున్సిపాలిటీ జూలై 8, ప్రభాతవార్త :** మంగళవారం సంగారెడ్డికి విచ్చేసిన రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్ అహ్మద్‌కు సంగారెడ్డి జిల్లా టిఎన్జీవోస్ యూనియన్ అధ్యక్షులు ఎండి జావీద్ అలీ గారి ఆధ్వర్యంలో కలిసి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీ వి. రవి అసోసియేట్ అధ్యక్షులు కసిని శ్రీకాంత్, వెంకట్ రెడ్డి కోశాధికారి శ్రీనివాస్ సెంట్రల్ యూనియన్ కార్యదర్శి గౌస్ హష్మీ, పట్టణ శాఖ అధ్యక్షులు వెంకటేశం గారు, మరియు ఉద్యోగులు పాల్గొన్నారు.


స్వాగతం పలుకుతున్న టీఎన్‌జిఓ నేతలు


సిఐ సైదాకు నగదు రివార్డు అందజేస్తున్న సిపి అనురాధ

## గజ్వేల్ సిఐ సైదాకు నగదు రివార్డు అందజేసిన సిపి

**గజ్వేల్, జూలై 8 (ప్రభాతవార్త):** 15 రోజుల క్రితం వృద్ధురాలిని చంపి బంగారం దొంగిలించిన కేసులో నేరస్తుడిని అరెస్ట్ చేసిన సిఐ సైదా, అడిషనల్ సిఐ ముత్యంరాజుతో పాటు క్రైమ్ సిబ్బందికి సిద్దిపేట సిపి అనురాధ మంగళవారం పోలీస్ కమిషనరేట్‌లో నగదు రివార్డు అందజేశారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ వృద్ధురాలు హత్య కేసును ఛేదించి ప్రాపర్టీ రికవరీ చేసినందుకు అభినందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏసిపి నర్సింలు, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్లు కిరణ్, శ్రీధర్‌గౌడ్, కంట్రోల్ రూమ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశంగౌడ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సిపిని కలిసిన ఎస్ఐ కృష్ణారెడ్డి

**జగదేవ్‌పూర్, జూలై 8 (ప్రభాతవార్త):** ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన జె.కృష్ణారెడ్డి మంగళవారం సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిపి అనురాధ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలకు పెద్దపీట వేయాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలని, గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. నేను సైతం కార్యక్రమం ద్వారా గ్రామాలలో పనిచేయని సిసి కెమెరాలను గ్రామస్తులు, వ్యాపారస్తులతో కలిసి మరమ్మతు చేయించాలని సూచించారు.

## క్రమశిక్షణతో చదివితే విజయం తథ్యం : సిఐ

**అల్లాదుర్గం, జూలై 8, ప్రభాతవార్త:** ఉన్నత లక్ష్యాలకు విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అందుకోవాల్సిన అవసరం ఉంటుందని సిఐ రేణుకరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన అల్లాదుర్గంలోని జడ్పీహెచ్ఎస్, జూనియర్ కళాశాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సిఐ సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా సిఐ రేణుకరెడ్డి మాట్లాడుతూ క్రమ శిక్షణతో విద్యను అందుకుని ఉన్నతులుగా ఎదిగి పాఠశాల, గ్రామం, పోషకులకు మంచి పేరు తీసుకురావాల్సిన అవసరం విద్యార్థులపై ఉంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సుగారం మాట్లాడుతూ ఉత్తమ విద్యార్థులు ఎదిగేందుకు ఇటాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ప్రతినిధులను అభినందించారు. ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ రీజనల్ అధ్యక్షులు కొంక రాజేశ్వర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు ఉచితంగా వ్యక్తిత్వ శిక్షణ తరగతులు నిర్వహించి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంగారెడ్డి రీజనల్ ద్వార నగదు పురస్కారాలతో పాటు జ్ఞాపికలు శాలువాలతో సత్కరించి కుటుంబ, పాఠశాల బాధ్యుల మధ్యన సన్మానించడం జరిగిందన్నారు. సర్వీస్ కో-ఆర్డినేటర్ దేవల రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను ఆర్జిస్తే బంగారు భవిష్యత్తు తథ్యమన్నారు. కార్యక్రమంలో రీజనల్ కార్యదర్శి చిట్టిపు నర్సింహారెడ్డి, డైరెక్టర్ ఎగ్జిక్యూటివ్ లీడర్షిప్ కే నర్సింలు, మండల విద్యాధికారి ధనుంజయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐ రేణుకరెడ్డి

# జోరుగా ఇసుక అక్రమ డంపులు


అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్

**బెజ్జంకి, జూలై 8, ప్రభాతవార్త :** మండల పరిధిలోని తోటపల్లి గ్రామంలో గల మోయతుమ్మెద వాగు ఇసుక అక్రమ రవాణాదారులకు కాసుల పంట కురిపిస్తుందనడంలో అతిశయోక్తి లేదు. ప్రభుత్వ పనుల పేరుతో మోయతుమ్మెద వాగులో పరిమితికి మించి ఇసుకను తోడేస్తూ నిర్మానుష్య ప్రదేశాల్లో పదుల సంఖ్యలో అక్రమంగా నిల్వ చేసి రాత్రి సమయంలో మిని ట్రక్ వంటి వాహనాల్లో పట్టణాలకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తూ ప్రభుత్వ ఖజానాకు ఇసుక మాఫియాదారులు గండికొడుతున్నారు.

### అక్రమ రవాణాదారులకు కలిసొచ్చిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

మండల వ్యాప్తంగా ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల ఇసుక అక్రమ రవాణాదారులకు కలిసొస్తుంది. ఇందిర్మ ఇళ్ల నిర్మాణాల పేరుతో ఇసుక అక్రమ రవాణాదారులు రెచ్చిపోతూ రెవెన్యూశాఖ నిర్ణయించిన సమయం ముగిసినప్పటికి ఇసుకను రవాణా చేస్తూ ఒక రోజులో సమారుగా రెండు నుంచి నాలులు ట్రిప్పుల వరకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు రవాణా చేస్తూ మిగత సమయంలో వీరాపూర్, తోటపల్లి గ్రామ శివారు ప్రాంతాల్లోని కెనాల్ కాలువ వద్ద పదుల సంఖ్యలో ఇసుకను నిల్వ చేసి రాత్రి సమయాల్లో పట్టణాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుకను ఉచితంగా రవాణా చేయాలని సూచించినప్పటికి అచరణలో మాత్రం అమలుకావడం లేదు. ఇళ్ల నిర్మాణాలకు సైతం అధిక ధరకే ఇసుకను విక్రయిస్తున్నారని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ఇసుక మాఫియాదారులకు కల్పవృక్షంగా మారాయని ఇళ్ల లబ్దిదారులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధితశాఖ అధికారులు ప్రత్యేక చొరవతీసుకొని ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసి ప్రభుత్వ ఖజానాను కాపాడాలని సామాన్యుడికి ఇసుక అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులు కోరుతున్నారు.


రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు

## వైఎస్‌కు ఘన నివాళులు

**సిద్దిపేట రూరల్, జూలై 8,ప్రభాతవార్త :** ఉమ్మడి ఎపి సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 76వ జయంతి వేడుకలను మంగళవారం సిద్దిపేటలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఉమ్మడి ఎపి సిఎంగా ప్రజలకు అందించిన సేవలు మరవలేనివన్నారు. స్వర్గీయ వైఎస్ఆర్ అడుగుజాడల్లో నడుచుకోవాల్సిన బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్తపై ఉందన్నారు.కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూజల గోపీకృష్ణ, యూత్ కాంగ్రెస్ నాయకులు వాహబ్, అజమాత్, రషద్, ఎర్ర మహేందర్, శ్రీనివాస్, జనార్ధన్‌రెడ్డి, అనిల్‌రెడ్డి,రాకేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

**నంగునూర్‌లో...**

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి భౌతికంగా దూరమైన ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచారని జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సాదుల పవన్ కుమార్ అన్నారు. మంగళవారం నంగునూర్ మండల కేంద్రంలో ఉమ్మడి ఎపి సిఎం స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం.డి.ఇమ్రాన్, బాలరాజు, కనకయ్యగౌడ్, అశోక్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, హరీష్, అభినవ్, రాజు, శ్రీధర్, శివ తదితరులు పాల్గొన్నారు.

**గజ్వేల్‌లో...**


వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సర్దార్‌ఖాన్

**గజ్వేల్, జూలై 8 (ప్రభాతవార్త):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా మంగళవారం ప్రజ్ఞాపూర్ చౌరస్తాలో గల వైఎస్ఆర్ విగ్రహానికి గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌లో ప్రతిపక్ష నేతగా ఉంటూ 1467 కిలోమీటర్లు సుదీర్ఘ పాదయాత్ర చేసి ప్రజల సమస్యలను తెలుసుకున్న ప్రజా నాయకుడు వైఎస్ఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, యాదవ సంఘం మండల అధ్యక్షుడు కొనమైన కన్నాయాదవ్, గుండు లక్ష్మణ్, కొల్లూరు సత్యం, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు శివులు, జంగం రమేష్‌గౌడ్, పెర్క నాగరాజు, రఫియొద్దీన్, ఏఎంసి డైరెక్టర్లు డాక్టర్ వాహిద్, అక్కారం యాదగిరి, గజ్వేల్ నియోజకవర్గ అధ్యక్షుడు అజార్, దయ్యాల యాదగిరి, జాలిగామ ఆంజనేయులు, శ్రావణ్, మన్నె అరుణ్‌కుమార్, కప్ప భాస్కర్, పొద్దుటూరి వేణు, ముత్రాజ్ పల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

**హుస్నాబాద్‌లో...**


వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**హుస్నాబాద్ టౌన్ , జూలై 8 , ప్రభాతవార్త :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రైతులకు ఏకకాలంలో రూ. 1 లక్ష రుణమాఫీతోపాటు ఉచిత విద్యుత్ అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డిది అని సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య అన్నారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆయన 76వ జయంతి వేడుకలను కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

## పంట మార్పిడితో అధిక దిగుబడి : ఎడిఎ

**టేక్మాల్, జూలై 8 ప్రభాతవార్త:** పంట మార్పిడితో పండించిన పంటకు అధిక దిగుబడి వస్తుందని పెద్దశంకరంపేట ఏడిఏ రాంప్రసాద్ అన్నారు. మంగళవారం టేక్మాల్ వ్యసాయ శాఖ కార్యాలయంలో పప్పు దినుసుల సాగు దిగుబడి పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు రకాలుగా ప్రోత్సహిస్తున్నారని, అందులో భాగంగా ప్రతియేడు లాగానే ఈ సారికూడా అన్నదాతలకు జాతీయ ఆహార భద్రత పథకం కింద ఉచితంగా విత్తనాలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంది 22 బ్యాగులు, జొన్నలు 9 బ్యాగులను పంపిణీ చేశామన్నారు. రాబోయే రోజుల్లో పప్పుదినుసులు, చిరుధాన్యలకు మంచి ధరలు ఉంటాయన్నారు. పంట మార్పిడితో పండించిన పంటకు మంచి దిగుబడి వస్తున్నారు. పంట మార్పిడితో యూరియా వాడకం తగ్గుతున్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రవీణ్ రైతులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**బెజ్జంకి, జూలై 8, ప్రభాతవార్త:** మండల పరిధిలోని చీలాపూర్ గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ సిబ్బంది పబ్బతి పోశెట్టి ఇటీవల మృతి చెందగా మంగళవారం ఎంపిడివో కడవెర్గు ప్రవీణ్, ఎంపివో మంజుల, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు బాధిత కటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన ఎస్ఐ సమతకు సన్మానం

**మిరుదొడ్డి, జూలై 8, ప్రభాతవార్త :** మిరుదొడ్డి నూతన ఎస్ఐగా సమత బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మండల మాజీ ఎంపిపి గజ్జల సాయిలు, కాంగ్రెస్ నాయకులు చెన్నయ్ భూపాల్‌గౌడ్, రాజిరెడ్డి, మహేందర్‌రెడ్డి, మంచాల మల్లేశం, మల్కాపురం నరసింహులు లింగుపల్లి భాస్కర్ తదితరులు కలిసి సన్మానించారు.


నూతన ఎస్ఐని సన్మానిస్తున్న దృశ్యం

## ఉరడమ్మకు ఆషాఢమాసం పూజలు

**-అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన-భక్తులకు ప్రసాద వితరణ**



హద్నూర్‌లో ఉరడమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న గ్రామ భక్తులు

**న్యాల్‌కల్, జూలై 8, ప్రభాతవార్త:**
మండలంలోని హద్నూర్ గ్రామం మంగళవారం ఉరడమ్మ అమ్మవారి నామస్మరణతో మారుమ్రోగింది. ఆలయాన్ని పునర్‌నిర్మించి విగ్రహ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలు గతసంవత్సరం జూలై మాసంలో నిర్వహించిన సందర్భంగా మొదటి ఏడాది వార్షికోత్సవంతో పాటు ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో అర్చకులు శివమూర్తిస్వామి, సిద్దయ్యస్వామి, కుమారస్వామిలు వేదమంత్రాలు వల్లిస్తూ అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. గ్రామస్థులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారినిదర్శించుకుని ఏర్పాటుచేసిన తీర్థప్రసాదాలను స్వీకరించారు.

## డిఈఓకు పూలబొకేను అందచేసిన ఎంఈఓ



డిఈఓ వెంకటేశ్వర్లుకు పూలబొకేను అందచేస్తున్న శ్రీనివాస్

**సిర్గాపూర్, జూలై 8, ప్రభాతవార్త:**
జిల్లా విద్యాధికారి సుంకేసుల వెంకటేశ్వర్లు జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం మండల విద్యాధికారి నాగారం శ్రీనివాస్ పూలబొకేను అందచేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## ఆయిల్ పామ్ సాగుకు రైతు ఆసక్తి

**-టెక్నికల్ అడ్వైజర్ డాక్టర్ వైయస్ రంగనాయకులు**



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఆయిల్‌పామ్ కంపెనీ టెక్నికల్ అడ్వైజర్ డాక్టర్ వైయస్ రంగనాయకులు

**అల్లాదుర్గం, జూలై 8, ప్రభాతవార్త:**
జిల్లాలో రైతులు ఆయిల్ పామ్ సాగుపై మొగ్గు చూపుతున్నారని ఆయిల్ పామ్ కంపెనీ టెక్నికల్ అడ్వైజర్ డాక్టర్ వైఎస్ రంగనాయకులు అన్నారు. మంగళవారం మండలకేంద్రమైన అల్లాదుర్గంలోని రైతువేదికలో వ్యవసాయ, ఉద్యాన, ఆయిల్ పామ్ కంపెనీల ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డాక్టర్ రంగనాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్ పామ్ సాగుపై సబ్సిడీ అందచేస్తోందన్నారు. చీడపీడల బెడద పంటకు తక్కువగా ఉంటుందన్నారు. 30 ఏళ్ల వరకు ఆదాయం లభిస్తుందన్నారు. బై బ్యాక్ పద్ధతిలో కంపెనీ ఉత్పత్తిని కొనుగోలుచేసేందుకు ఒప్పందం చేసుకుంటుండటంతో రైతులు పంటసాగుకు ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. జిల్లాలో 1000ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు కొనసాగుతోందన్నారు. ఆయిల్ పామ్ సాగుచేసే ఎస్సి, ఎస్టి రైతులకు డ్రిప్ సిస్టమ్ 100శాతం రాయితీ కాగా బిసిలకు 90శాతం, ఇతరులకు 80శాతం రాయితీని అందుకుంటారన్నారు. పంట మొక్కలు నాటిన 4సంవత్సరాల తరువాత పంట దిగుబడి ప్రారంభం అవుతుందని, 4సంవత్సరాల వరకు రైతులకు ఎకరానికి 4200రూపాయలను అందుకుంటారన్నారు. 30ఏళ్ల వరకు రైతులు నిరంతరంగా ఆదాయం అందుకుంటారన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా స్థిరపడాలని జిల్లా రైతులకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజేష్, ఎఈఓలు నవీన్‌కుమార్, అమృత్ లీవ్ పామ్ కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ జాన్సన్, రైతులు పాల్గొన్నారు.

## వైభవంగా నాయీ బ్రాహ్మణుల బోనాలు



బోనాల ఉత్సవాలలో పాల్గొన్న టిజిఐసి చైర్మన్ నిర్మలజగ్గారెడ్డి

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జూలై 8, ప్రభాతవార్త:**
ఆషాఢమాసం పురస్కరించుకుని మంగళవారం సంగారెడ్డి నాయిబ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో సంగారెడ్డిలో బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. నాయీ బ్రాహ్మణ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సాయినాథ్ ఆధ్వర్యంలో జరిగిన బోనాల ఊరేగింపు కార్యక్రమంలో టిజిఐసి చైర్‌పర్సన్ నిర్మలజగ్గారెడ్డి, టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత కిషన్, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తనయుడు సాయినాథ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐబి నుంచి మహిళల బోనాల ఊరేగింపుతో పోతురాజుల నృత్యాలతో ఘనంగావెళ్లి అస్తబల్ ఎల్లమ్మతల్లికి భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించారు.
కార్యక్రమంలో లక్దారం ప్రభు, వర్కింగ్ ప్రెసిడెంట్ సాయి నాథ్, ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, ఉపాధ్యక్షులు రంజోల్ ప్రభు, కార్యదర్శి మురహరి, సలహాదారులు పెంటయ్య, కోశాధికారి శేఖర్, ఉపకోశాధికారి ప్రభు, యువత గౌరవ అధ్యక్షులు ఆంజనేయులు అనసూయ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యాన పంటలపై అవగాహన

**సదాశివపేట, జూలై 8, ప్రభాతవార్త:**
మద్దికుంట గ్రామంలో ఉద్యాన పంటలు ముఖ్యంగా ఆయిల్ పామ్ పంటల మీద అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా పండ్లు, కూరగాయలు, పూలను పెంచే రైతులకు ఉద్యానశాఖ రాయితీలను అందిస్తున్నట్టు అధికారులు తెలిపారు. అదే విధంగా ఆయిల్ పామ్ సాగుకు ఎకరానికి రూ.50వేల సబ్సిడీని అందిస్తుందని సదాశివపేట ఉద్యాన అధికారి సునీత తెలిపారు. ఈ కార్యక్రమంలో సదాశివపేట ఉద్యాన అధికారి సునీత,మద్దికుంట పంచాయత్ సెక్రటరీ గాయత్రి, గోద్రెజ్ ఆయిల్ పామ్ అధికారి ఈశ్వర్, నిశిద డ్రిప్ ప్రతినిధి స్వామి, మద్దికుంట గ్రామరైతులు పాల్గొనడం జరిగింది.

# రైతులను భయపెట్టి సంతకాలు చేయించొద్దు

**-ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లకుండానే అధికారులు ఎలా నిర్ణయిస్తారు?**
**-భూమి రికార్డుల్లో పేర్లు ఎలా మారాయి? విచారణ జరిపించాలి..**
**-బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి**

**గుమ్మడిదల, జూలై 8, ప్రభాతవార్త:**
గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలోని సర్వే నంబరు 109లో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం రైతులతో కలిసి నష్టపరిహారాన్ని పెంచాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ సిఎం కెసిఆర్ భూమిని ఇండస్ట్రియల్ పార్క్‌కి కేటాయిస్తామని అన్నారు. అప్పుడు రైతులకు 600గజాల స్థలం ఇస్తామని చెప్పారు. మేము అధికారంలో ఉన్నప్పటికీ రైతులకు 1000గజాల స్థలాన్ని కేటాయించాలని డిమాండ్‌చేశాం. రైతులపక్షాన నిలబడ్డామని అన్నారు. బాధిత రైతులకు 70లక్షల నష్టపరిహారం, 300గజాల స్థలం కేటాయించాలని కోరారు. మేము రాజకీయాల కోసం కాదని, రైతులకు అండగా నిలబడటానికే పోరాటం చేస్తున్నామని స్పష్టం చేస్తున్నాం. పార్టీలకు అతీతంగా నాయకులు కూడా రైతులకు మద్దతుగా నిలవాలని కోరారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

**రైతులను భయపెట్టి సంతకాలు చేయించొద్దు..**
కొంతమంది స్థానిక నాయకులు కొంతమంది రైతులను తీసుకెళ్లి జిల్లా కలెక్టర్‌ను కలిసి సంతకాలు చేయించుకున్నారు. ఇది న్యాయమా? భూములు స్వాధీనం చేసుకునే సమయంలో ఎలా సమావేశాలు పెట్టారో... ఇప్పుడూ అలాగే రైతుల అభిప్రాయాలను తీసుకుని, నష్టపరిహారం వివరాలు స్పష్టంగా తెలియజేయాలి. రైతులను భయపెట్టి సంతకాలు చేయిస్తే ఊరుకోం. ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రైతులకు నష్టపరిహారం కేటాయింపు విషయాన్ని స్థానిక ఎమ్మెల్యేదృష్టికి తీసుకెళ్లకుండానే అధికారులు ఎలా నిర్ణయాలు తీసుకుంటారని ప్రశ్నించారు. గతంలో నియోజకవర్గస్థాయిలో వచ్చిన భూసమస్యలకు ఎమ్మెల్యే న్యాయంచేశారు. ఈవిషయాన్ని కూడా ఎమ్మెల్యేదృష్టికి తీసుకెళ్తే తప్పకుండా న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉందని అన్నారు. సర్వే నంబరు 109లో అసలైన అర్హులపేర్లు తొలగించి, ఒనాయకుడు తన పేరును ఎలా నమోదు చేయించుకున్నాడో ప్రజలకు తెలియజేయాలి. దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి విచారణ జరిపించాలని గోవర్ధన్‌రెడ్డి డిమాండ్‌చేశారు. రైతులకు న్యాయం జరిగేంత వరకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని స్పష్టంచేశారు. కార్యక్రమంలో బాలకృష్ణారెడ్డి, మద్దుల బాల్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు, సుధాకర్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, నారాయణయాదవ్, బీరప్ప, శ్రీకాంత్ గౌడ్, పెంటయ్య, మహిళలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బండి సంజయ్‌ను కలిసిన వాణిజ్య, వ్యాపారస్థులు



బండి సంజయ్‌ని కలిసిన చేర్యాల వాణిజ్య,వ్యాపారస్థులు

**చేర్యాల, జూలై 8, ప్రభాతవార్త:**
జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా చేర్యాల పట్టణంలోని ఇళ్ళు, దుకాణాల, భవనాల కూల్చివేతలను నిలిపివేయాలని చేర్యాల పట్టణ వర్తక, వాణిజ్య, వ్యాపారస్థులు కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. మంగళవారం బిజెపి జిల్లానాయకులు బూరుగు సురేష్‌గౌడ్ ఆధ్వర్యంలో మంత్రిని కరీంనగర్‌లోని ఆయన నివాసంలో కలిసి మాట్లాడారు. డ్రైనేజీకాలువ విస్తరణపనుల పేరుతో మరో 5ఫీట్లకు అదనంగా మార్కింగ్ ఇచ్చి ఇళ్ళు, దుకాణాలను కూల్చుతున్నారని మంత్రితో వారి ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో తమ జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్తితి వచ్చిందని వెంటనే ఆపనులను నిలిపివేసేవిధంగా చూడాలని కోరారు. అందె అశోక్, తేరాల రాజు, నాగభూషణం, శ్రీను, కత్తుల భాస్కర్ రెడ్డి, ఈరి భూమయ్య తదితరులున్నారు.

## కల్వర్టు నిర్మించారు-రక్షణ గోడలు మరిచారు



వంతెనకు రక్షణ గోడలు నిర్మించని దృశ్యం

**సిర్గాపూర్, జూలై 8, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని కిషన్‌నాయక్‌తాండ నుంచి పోట్పల్లికి వెళ్లేదారిలో కొత్తగా కల్వర్టును అయితే నిర్మించారు. కాని ఇరువైపు రక్షణగోడలు కట్టడం బాధ్యులు మరిచిపోయారు. కల్వర్టుకు రక్షణగోడలు లేకపోవడంతో అటుగా వచ్చే వాహదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉంటాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కల్వర్టు నిర్మించి నెలలు గడుస్తున్నందున సంబంధిత అధికారులు స్పందించి ఇరువైపు రక్షణగోడలు నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన అవసరం...

**పాపన్నపేట, జూలై 8, ప్రభాతవార్త:**
ప్రజలు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం పాపన్నపేటలో ఆయన మాట్లాడుతూ, ప్రజలు తమఫోన్లకు వచ్చే మోసపూరిత లింకులు తెరవద్దన్నారు. అపరిచిత వ్యక్తులకు ఫోన్లో వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతాల వివరాలు ఎట్టి పరిస్థితుల్లో తెలుపవద్దని సూచించారు. మోసపూరిత ఎపికె ఫైళ్లు, లింకులు ఓపెన్ చేస్తే సమాచారం అంతా సైబర్ నేరగాళ్ల చేతికి వెళ్తుందని వాటిని ఎట్టి పరిస్థితుల్లో ఓపెన్ చేయవద్దన్నారు. అత్యాశకు పోయి మోసపూరిత వెబ్‌సైట్‌లలో పెట్టుబడులు లాంటివి చేయవద్దని పేర్కొన్నారు. సైబర్ నేరాల బారినపడితే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నెంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు. విద్యార్థులు తమ కుటుంబీకులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు, సిబ్బంది, తదితరులున్నారు.

## సమస్యలను పరిశీలించిన కార్పొరేటర్



మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, జూలై 8, ప్రభాతవార్త:**
రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్‌కాలనీ 10వవార్డులో నెలకొన్న సమస్యలను కాలనీవాసుల వినతిమేరకు కార్పొరేటర్, జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బూరుగడ్డ పుష్పనగేష్ అధికారులతో కలిసి సమస్యలను పరిశీలించారు. 10వబ్లాక్‌లో నూతనంగా వేసిన సీవరేజ్ పైప్‌లైన్‌లో భాగంగా పలుచోట్ల సరిపోయే మ్యాన్‌హోల్స్ వేయలేదని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తేగా జలమండలి అధికారులతో కలిసి కాలనీలో పర్యటించి సమస్యలను ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే కాలనీలో రోడ్డు పనులు ప్రారంభం కానున్నాయని, అందుకు తమ తమ ఇంటర్నల్ లైన్‌లు నూతనంగావేసిన కొత్త పైప్‌లైన్‌లో కలవుకోవాలని కాలనీవాసులకు కార్పొరేటర్ సూచించారు. కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులకు కార్పొరేటర్ సూచించారు.

## ఇంటింటికీ వెళ్లి మందులు పంపిణీ చేయాలి

**-సిబ్బందికి సూచించిన కార్పొరేటర్ పుష్పనగేష్**




టాస్క్‌ఫోర్స్ కమిటీసమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, జూలై 8, ప్రభాతవార్త:**
ఈనెల 10వతారీఖు నుండి 25వతేదీవరకు నిర్వహించే జాతీయ ఫైలేరియా, నులిపురుగు నిర్మూలన కార్యక్రమాలను పురస్కరించుకుని వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఉచితంగా మందుబిళ్లలను పంపిణీ చేయాలని కార్పొరేటర్, జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బూరుగడ్డ పుష్పనగేష్ సూచించారు. మంగళవారం రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని మయూరి నగర్ కాలనీలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ కల్పన ఏర్పాటు చేసిన మండల స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశానికి కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరై సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతి ఒక్కరు వ్యాధిబారిన పడకుండా మాత్రలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ సురేష్, జిహెచ్‌ఎంసి ఎంటమాలజీ ఎఈ తిరుపతయ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

**-హత్నూర ఎంపిడిఓకు గ్రామస్థుల వినతి**

**హత్నూర, జూలై 2, ప్రభాతవార్త:**
హత్నూర మండలం బ్రాహ్మణగూడెం గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం గ్రామస్థులు హత్నూర ఎంపిడిఓ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. పూరి గుడిసెలలో, కూలిపోయిన ఇళ్లలో ఉంటున్నవారు ఉన్నారని, అలాంటి వారికి ఇవ్వాలని వారు వినతిపత్రంలో కోరారు.

# ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేదవాడి కల నెరవేరుస్తాం

**-ఆత్మ కమిటీ చైర్మన్ వై.ప్రభు**



ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేస్తున్న వై.ప్రభు

**కొండాపూర్, జూలై 8, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని శివన్నగూడెం, మన్సాన్‌పల్లి, చెర్లగోపులారం గ్రామాలలో మంగళవారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు ఆత్మకమిటీ చైర్మన్ వై. ప్రభు భూమిపూజ చేసి లబ్ధిదారులకు పట్టాపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేదవాడి కల నిజమయ్యేలా ఇందిరమ్మ గృహాలను నిర్మించి ఇస్తున్నామని ప్రభుత్వం ఇచ్చినమాట ప్రకారం తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో నిరుపేదలైన వారికి ఇందిరమ్మ గృహాలను నిర్మించి ఇస్తామని దృఢ సంకల్పంతో ఈకార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఆయా దశలలో కొనసాగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియం చేసుకొని సొంత గృహాలు నిర్మించుకోవాలని సొంతింటి కల నెరవేర్చే విధంగా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి నరసింహారెడ్డి, డి. ప్రేమానందం, ఆత్మ కమిటీ డైరెక్టర్ రాజు, మాజీ సర్పంచ్ రత్నయ్య, ఎంపిడిఓ ఎం.సత్తయ్య, హౌసింగ్ డైరెక్టర్ మాధవరెడ్డి, పంచాయతీ సెక్రటరీ ప్రమీల, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీమాణిక్‌ప్రభు పాఠశాల ఆవరణలో వనమహోత్సవం



వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ మాణెయ్య

**జహీరాబాద్, జూలై 8, ప్రభాతవార్త:**
పట్టణంలోని మాణిక్‌ప్రభు మహేలాలోని శ్రీమాణిక్‌ప్రభు హైస్కూల్ నూతన భవననిర్మాణ ఆవరణలో మంగళవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మండలవిద్యాధికారి మాణెయ్య ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. పాఠశాలలో వనమహోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమని పాఠశాల కరస్పాండెంట్ ఎం.వెంకటయ్యను అభినందించారు. కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జి గంకటి శుక్లవర్ధన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, ఎంపల్లి విజయ్‌కుమార్, పాఠశాల అధ్యక్షులు ఎంపల్లి మల్లికార్జున్, కార్యదర్శి కొత్తకాపు సుభాష్‌రెడ్డి, ఉపాధ్యాయులు శివశంకర్, అరుణ, స్వరూప, మాణిక్యమ్మ, శ్రావణి, సోని, మధు, మహానంద, విద్యార్థులు పాల్గొన్నారు.

## వీరభద్రస్వామి హుండీ లెక్కింపు

**-113రోజుల ఆదాయం 19 లక్షలు**



హుండీ లెక్కిస్తున్న దృశ్యం

**గుమ్మడిదల, జూలై 8, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోగల ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం వీరన్నగూడెం వార్డులో కొలువైయున్న భద్రకాళీసమేత వీరభద్రస్వామి ఆలయహుండీ లెక్కింపు మంగళవారం డివిజనల్ ఇన్స్పెక్టర్ రంగారావు, కార్యనిర్వహణాధికారి శశిధర్‌గుప్తా, ఆలయకమిటీ చైర్మన్ మద్ది ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయంనుండి ప్రారంభించగా మధ్యాహ్నానికి ముగింపు పలికింది. హుండీ లెక్కింపులో 113రోజులకుగాను హుండీ ఆదాయం రూ.18,92,153 వచ్చింది. అన్నదానం హుండీ ఆదాయం రూ.91,501 వచ్చినవని వారు తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తలు అశోక్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, యాదగిరిగౌడ్ వీరస్వామి, కృష్ణ, మాజీచైర్మన్‌లు గ్రామపెద్దలు నాగేందర్‌గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, వేణు, లక్ష్మీ మినారాయణ, అర్చకులు, భక్తులు, ఆలయ సిబ్బంది సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకు రెండు వందల కోట్ల బకాయిలు చెల్లించాలి

**-గిరిజనసంక్షేమ కార్యదర్శికి వినతిపత్రం అందచేసిన జైపాల్‌నాయక్**



గిరిజనసంక్షేమ కార్యదర్శి శరత్‌కు వినతిపత్రం అందచేస్తున్న గిరిజనసంక్షేమ జిల్లా అధ్యక్షులు జైపాల్‌నాయక్

**పుల్‌కల్, జూలై 8, ప్రభాతవార్త:**
ఎస్సి,ఎస్టి బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి 2వందల కోట్ల బకాయిలను విడుదల చేయాలని గిరిజనసంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు జైపాల్‌నాయక్ కోరారు. మంగళవారం హైద్రాబాద్‌లోని సచివాలయంలో గిరిజనసంక్షేమ శాఖ కార్యదర్శి శరత్‌ను కలుసుకుని వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా జైపాల్‌నాయక్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 210పాఠశాలల్లో విద్యను అందుకుంటున్న ఎస్సి,ఎస్టి నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వం గతరెండేళ్లుగా పెండింగ్‌ఫీజులను విడుదలచేయడం లేదన్నారు. బకాయిఫీజులను ప్రభుత్వం చెల్లించకపోతుండటంతో ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను బయటకు పంపేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. జిల్లాకేంద్రమైన సంగారెడ్డి బైపాస్ డిఈఆర్‌డిఎలో కొనసాగుతున్న గిరిజన బాలికల వసతి గృహంలో ఆశ్రమ పాఠశాలలను ఏర్పాటు చేయాలని కోరారు. 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు కేవలం వసతిగృహం మాత్రమే నిర్వహిస్తున్నారని, చదువుకునేందుకు పాఠశాల లేకపోవడంతో 4కిలోమీటర్ల దూరంలో ఉన్న పాత బస్టాండ్ జిల్లాపరిషత్ బాలికల పాఠశాలకు వెళ్లి విద్యను అందుకోవాల్సిన దుస్థితి దాపురించిందని వాపోయారు. బాలికలు 4కిలోమీటర్ల దూరంలోని పాఠశాలకువెళ్లి విద్యను అందుకునేందుకు ఇబ్బందులకు గురవుతున్నందున వసతిగృహం కొనసాగుతున్న భవనంలోనే ఆశ్రమ పాఠశాలను ఏర్పాటు చేసి విద్యార్థినులు విద్యను అందుకునేలా చూడాలని శరత్‌కు అందచేసిన ఫిర్యాదులో కోరినట్లు జైపాల్‌నాయక్ సూచించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాజునాయక్, బాబూలాల్, దుర్వాస్, క్రాంతి, రాజు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బోనాల వేడుకలు

**సదాశివపేట, జూలై 8, ప్రభాతవార్త:**
సదాశివపేట పట్టణంలో ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నాగుల విజయకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం బోనాల పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అందరినీ చల్లగా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం ఫంక్షన్‌హాల్‌లో ఫోటో, వీడియోగ్రాఫర్స్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఫోటోగ్రఫీ సంక్షేమ సంఘం కోశాధికారి మాధవరెడ్డి, జిల్లా అధ్యక్షులు సుప్పాల శ్రీనివాస్, రాష్ట్ర సహాయ కార్యదర్శి దాసరి శ్రీధర్‌లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కుటుంబ భరోసా బాధితులు సామల రవికుమార్ కుటుంబసభ్యులకు రూ. 1,60,000 చెక్కును అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కుటుంబభరోసా ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు బిట్ల రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి జయచింతన్, కోశాధికారి కరుణాకర్, నాయకులు శ్రీనివాస్, మహేష్, శ్రీకాంత్, రుమాండ్ల రాజు, బండారి పాండు, మల్లేశం సత్యనారాయణ, వివిధ మండల, పట్టణ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## అన్న బాటలోనే తమ్ముడు

**శ్రీవిద్య పాఠశాల విద్యార్థి నవోదయకు ఎంపిక**

**పాపన్నపేట, జూలై 8, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన పాపన్నపేటలోని శ్రీవిద్య పాఠశాల విద్యార్థి ఎం. వర్షిత్ నవోదయ ఎంట్రన్స్ పరీక్షలో ర్యాంకు సాధించి సెకండ్ లిస్టులో నవోదయ పాఠశాలలో ఆరవతరగతికి ఎంపికయ్యారు. మండల పరిధిలోని కుర్తివాడగ్రామానికి చెందిన మధునాల లింగం, కవిత దంపతుల కుమారుడు వర్షిత్. నర్సరీనుండి ఐదవతరగతివరకు శ్రీవిద్య పాఠశాలలో చదువుకున్నాడు. గతంలో వీరిపెద్దకుమారుడు శశాంక్ నవోదయపరీక్షలో ర్యాంకుసాధించి సీటు సంపాదించాడు. ఇద్దరూ శ్రీవిద్య పాఠశాల విద్యార్థులే. అన్నబాటలోనే తమ్ముడు అన్నట్లుగా సీట్లు సాధించారు. వీరి ఎంపికకు కృషిచేసిన పాఠశాల ఉపాధ్యాయులకు ప్రిన్సిపల్ రవీందర్, కరెస్పాండెంట్ నిట్టలాక్షప్ప సుమన్ కృతజ్ఞతలు తెలియజేశారు.